TGTEL/25/A1907


# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 310 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శుక్రవారం.05.06.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## తెలంగాణ రైజింగ్--2047 విజన్ భేష్



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ రాష్ట్రానికి , జర్మనీలోని ప్రతిష్టాత్మక తురింగియా రాష్ట్రానికి మధ్య టెక్నాలజీ, స్కిల్ డెవలప్‌మెంట్, స్టార్టప్‌ల రంగాలలో ఒక కీలకమైన అవగాహన ఒప్పందం కుదిరింది. హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డితో తురింగియా సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని జర్మన్ ప్రతినిధుల బృందం ప్రత్యేకంగా సమావేశమై, ఈ చారిత్రాత్మక ఒప్పందంపై సంతకాలు చేసింది. భారత-జర్మనీ దేశాల మధ్య ఉన్న దౌత్య, ఆర్థిక సంబంధాల్లో తెలంగాణకు ఒక ప్రత్యేక స్థానం ఉందని తురింగియా సీఎం మారియో వోయిట్ ఈ సందర్భంగా కొనియాడారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 'తెలంగాణ రైజింగ్--2047' విజన్‌పై జర్మనీ ప్రతినిధులు ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ అనుసరిస్తున్న నూతన అభివృద్ధి నమూనాకు అంతర్జాతీయంగా దక్కిన గుర్తింపుగా దీనిని అభివర్ణించవచ్చు.

తెలంగాణ యువత ప్రపంచవ్యాప్తంగా తమ ప్రతిభను చాటుతోందని, ఇప్పటికే అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో మన యువత కీలక పాత్ర పోషిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఇప్పుడు జర్మనీతో కుదిరిన ఈ సరికొత్త ఒప్పందం ద్వారా రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని బలమైన పునాదులు పడనున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం తెలంగాణ యువతకు జర్మనీలో విస్తృతమైన ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ఒక కీలక మైలురాయి కానుంది. జర్మనీ మార్కెట్ అవసరాలు, అక్కడి పరిశ్రమల డిమాండ్‌కు అనుగుణంగా తెలంగాణ యువతకు ఇక్కడే ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా, రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటవుతున్న 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి తురింగియా రాష్ట్రం పూర్తి సాంకేతిక సహకారం అందించనుంది. అలాగే, రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో (ఏటీసీఎ) బోధనా పద్ధతులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మార్చేందుకు జర్మనీ మద్దతు లభించనుంది. దీనికి అదనంగా, హైదరాబాద్‌లో జర్మన్ భాషా శిక్షణను మరింత విస్తరించాలని ఈ సమావేశంలో ప్రతిపాదించారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టీఓఎంసీఓఎం) ద్వారా ఇప్పటికే రాష్ట్రంలో జర్మన్ భాషా శిక్షణ విజయవంతంగా కొనసాగుతోందని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి ఈ సందర్భంగా వెల్లడించారు.

## తెలంగాణ రైతులపై బీజేపీ వివక్ష?



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ రైతులు దేశంలోనే అత్యధికంగా ధాన్యం ఉత్పత్తి చేస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం రాష్ట్ర రైతుల పట్ల వివక్ష చూపుతూ ధాన్యం సేకరణ లక్ష్యాలను కుదించడం దురదృష్టకరమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలనే సంకల్పంతో ప్రజా పాలన ప్రభుత్వం పనిచేస్తుంటే, కేంద్రం మాత్రం రైతులను నిరాశపరుస్తోందని తెలిపారు. 2025-26 యాసంగి సీజన్‌లో ఇప్పటివరకు 67.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, రూ.12,375 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని మంత్రి చెప్పారు. దీంతో 10 లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందారని గుర్తు చేశారు. అకాల వర్షాలతో తడిసిన 10,215 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా రైతులు నష్టపోకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించిందని గుర్తు చేశారు.

రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 8575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు కేంద్రాలకు తీసుకొచ్చే చివరి గింజ వరకు కొనుగోలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి చెప్పారు. కానీ కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేదని పేర్కొన్నారు. యాసంగిలో తెలంగాణలో 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తే , కేంద్రం కేవలం 52 లక్షల టన్నులు, అంటే 37 శాతానికి పరిమితం చేసిందని తెలిపారు. మరోవైపు పంజాబ్‌కు 86 శాతం, ఛత్తీస్‌గఢ్‌కు 67 శాతం, హర్యానాకు 65 శాతం, ఒడిశాకు 52 శాతం సేకరణ లక్ష్యాలు కేటాయించిన కేంద్రం, తెలంగాణకు మాత్రం కేవలం 37 శాతం మాత్రమే కేటాయించడం పట్ల బీజేపీ చేస్తున్న వివక్షను ప్రశ్నించారు.

గత ప్రభుత్వం పదేండ్ల కాలంలో ధాన్యం కొనుగోళ్లకు రూ.1.35 లక్షల కోట్లు ఖర్చు చేయగా, ప్రజా ప్రభుత్వం కేవలం రెండేండ్లల్లోనే రూ.84 వేల కోట్లను రైతుల కోసం ఖర్చు చేసి సగటున ఏడాదికి రూ.42 వేల కోట్లను రైతుల కోసం వెచ్చించడం కాంగ్రెస్ ప్రభుత్వ రైతు సంక్షేమ నిబద్ధతకు నిదర్శనమని వివరించారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుంటుందని చెప్పారు. కొనుగోళ్ల బాధ్యత మొత్తం రాష్ట్రాలపై వేసి భారం మోపుతోందన్నారు.మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ.2,400 చెల్లిస్తూ ఇప్పటికే రూ.1172 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామనీ , జొన్నలను క్వింటాల్‌కు రూ.3699 చొప్పున కొనుగోలు చేసి రూ.350 కోట్లను రైతులకు చెల్లిస్తే ఇందులో కేంద్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం సరకాదన్నారు. తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం ధాన్యం సీలింగ్‌ను వెంటనే ఎత్తివేయాలని రాష్ట్రంలో పండిన ధాన్యంలో కనీసం 70 శాతం కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ను డిమాండ్ చేశారు.

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై కేంద్రం, ?రాష్ట్ర బీజేపీ నేతల నిర్లక్ష్యం

ఉత్తర తెలంగాణ రైతుల భవిష్యత్తుకు అత్యంత కీలకమైన తుమ్మిడిహెట్టి బ్యారేజీ అంశంపై ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళుతున్నదనీ, ప్రభుత్వంతో చర్చల కోసం రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు లేఖలు రాసినా స్పందన మంత్రి చెప్పారు . ఇటీవల గత నెల ఆరో తేదీన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మే 25న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కు లేఖలు రాసినా ఇప్పటివరకు స్పందించలేదనీ తెలిపారు. తెలంగాణ ప్రయోజనాల కోసం రాష్ట్ర బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదనీ మంత్రి పొన్నం ప్రశ్నించారు. మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా, తెలంగాణ బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎందుకు ఒత్తిడి తేవడం లేదన్నారు. తెలంగాణ రైతులకు రావాల్సిన నీటి హక్కుల విషయంలో బీజేపీ మౌనం వీడాలని సూచించారు. ఉత్తర తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర బీజేపీ నాయకులను డిమాండ్ చేశారు.

## అన్నదాతకు దిక్కెవరు!

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఏప్రిల్‌లో మొదలయ్యాయి. జూన్ నెల వచ్చినా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. వర్షాకాలం సీజన్ మొదలైంది. పదిరోజులుగా పలు ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నాయి. రాష్ట్రంలో 2021 సీజన్ నుంచి ఇప్పటివరకు యాసంగిలో సగటున కోటీ 40 లక్ష?ల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వస్తున్నది. ఎమ్ఎస్‌పీకి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే. అయితే కొన్నేండ్లుగా ధాన్యం కొనుగోళ్ల విషయంలో మోడీ సర్కారు షరతులు పెడుతూ వస్తున్నది. ఈసారి 52 లక్ష?ల మెట్రిక్ టన్నులు కొంటామని పరిమితి విధించింది. కానీ ఈ ఏడాది రాష్ట్రంలో కోటీ 40 లక్ష?ల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసి, కేంద్రం కొనుగోళ్ల వాటాను పెంచాలనీ రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. కనీసం 70 శాతం కొనాలని కేంద్రానికి విజ్ఞప్తులు చేస్తూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు కేంద్రానికి లేఖలు రాశారు. రాష్ట్రంలో పండించిన ధాన్యంలో కేవలం 37 శాతం మాత్రమే కొనుగోలు చేస్తామని కేంద్రం చెప్పకనే చెప్పేసింది. అయితే కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి మాత్రం కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి డబ్బులిచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నదని ప్రచారం చేసుకుంటున్నారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రంపై నిప్పులు చెరుగుతున్నారు. ఈనెల 15లోపు కేంద్రం ధాన్యం మొత్తం కొనకుంటే బీజేపీ కార్యాలయాలు, కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధుల ఇండ్లముందు ధాన్యం కుమ్మరిస్తామని హెచ్చరిస్తున్నారు. అయితే కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో పాటు సన్నబియ్యానికి బోనస్ కూడా ఇచ్చి 90 లక్ష?ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే దానికి తగినట్టు ఏర్పాట్లు చేసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా విఫలమైంది. పక్కా ప్రణాళిక లేకపోవడంతో గన్నీ బ్యాగుల కొరత, రవాణా వాహనాల కొరత, లేబర్ కొరత వంటి అనేక అవరోధాలు ఏర్పడ్డాయి. బుధవారం నాటికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరంబోనస్‌తో కలిపి మొత్తం 70.06 లక్ష?ల మెట్రిక్ టన్నులు సేకరించినట్టు పౌరసరఫరాల శాఖ వెల్లడించింది. ఇంకా 30 శాతం ధాన్యం రాశులు కల్లాలు, మార్కెట్ యార్డుల్లోనే ఉన్నాయి. 20 శాతం పంటను రైతుల ఇప్పటికే దళారులకు అమ్మేసుకున్నారు. కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీల వైఫల్యం

## చంచల్‌గూడ జైల్లో బాల్క సుమన్‌ను కలిసిన కేటీఆర్



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు ములాఖత్‌లో కలిశారు. కేటీఆర్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సుధీర్ రెడ్డి కూడా బాల్క సుమన్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు. జైల్లో ఉన్న సుమన్‌కు పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు.

## ఫ్యూచర్ సిటీని రద్దు చేయం: పొంగులేటి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణలో రేపటి నుంచి భూముల మార్కెట్ విలువలు పెంచుతున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మీడియాతో ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడారు. "భూముల మార్కెట్ విలువలు 50 నుంచి 100 శాతం పెంచుతాం. దీంతో ప్రభుత్వానికి రూ.1,400 కోట్ల ఆదాయం సమకూరుతుంది. శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, ఖాజాగూడ వంటి ప్రాంతాల్లో అధిక పెంపు ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచే ఆలోచన లేదు. ఫ్యూచర్ సిటీని రద్దు చేసే అవకాశమే ఉండదు. త్వరలో తహసీల్దార్ల బదిలీలు ఉంటాయి" అని తెలిపారు.

## ప్రజల కోసం త్యాగాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టులదే




ఖమ్మం :అమృత్ తెలంగాణ: సమాజంలో ప్రజల కోసం త్యాగాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టులదేనని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పి సోమయ్య అన్నారు. కమ్యూనిస్టుల విశిష్టత అనే అంశంపై క్లాస్ బోధిస్తూ ఆయన మాట్లాడారు. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా అమెరికాలో సాగిన కార్మిక పోరాటం నుండి వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం వరకు కమ్యూనిస్టులు ప్రజల కోసం అసమానమైన త్యాగాలు చేశారని ప్రజల కోసం త్యాగాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టులదేనని అన్నారు. బ్రిటి సామ్రాజవాదానికి వ్యతిరేకంగా దేశ స్వాతంత్రం కోసం కమ్యూనిస్టులు జాతీయోద్యమంలో భాగంగా ఏళ్లకు ఏళ్లు జైలు జీవితం గడిపారని తెలిపారు. దున్నేవాడికే భూమి కావాలని మట్టి మనుషుల చేత బంధువులు పట్టించి నైజాం నవాబులను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టులదేనని గుర్తు చేశారు. పది లక్షల ఎకరాల భూ పంపిణీ మూడువేల గ్రామ స్వరాజ్యాలు కమ్యూనిస్టుల నాయకత్వంలో ఏర్పాటు అయ్యాయని తెలిపారు.సీపీఐ(ఎం) నాయకత్వంలో పనిచేసిన వామపక్ష ప్రభుత్వం కేరళని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దని ఇది కమ్యూనిస్టు పార్టీకి ప్రజల పట్ల ఉన్న నిబద్ధతని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల్లో ఓట్లు సీట్లు ఆధారంగా కమ్యూనిస్టు పార్టీల బలం తగ్గిందని కొద్ది మంది కమ్యూనిస్టు వ్యతిరేకులు సంబరపడుతున్నారని కానీ ఇది శాశ్వతం కాదని తెలిపారు. కమ్యూనిస్టుల బలం ఓట్లు సీట్లలో లేదని ప్రజా పోరాటాల్లో కమ్యూనిస్టుల బలం ఉందని తెలిపారు. గెలిచినా ఓడిన ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యలపై నికరంగా రాజీలేని పోరాటాలు చేసే చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని ప్రజల నుండి కమ్యూనిస్టు పార్టీని వేరు చేయడం ఎవరి తరం కాదని తెలిపారు. పేదరికం దరిద్రం సామాజిక అసమానతలు ఉన్నంతకాలం కమ్యూనిజం ఉంటుందని కమ్యూనిస్టు పార్టీ ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, కొక్కెరపాటి పుల్లయ్య, ఎం బి నర్సారెడ్డి, కే బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్, ధర్మ దొడ్డ రవి, ఎస్ఏ నబి, చిరంజీవి, నాయుడు, పిట్టల అర్జున్, మోరంపూడి శ్రీనివాస్, పాల్గొన్నారు.

# "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" పర్యావరణ వారోత్సవాలలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీని జండా ఊపి ప్రారంభిస్తున్న డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ భూబడే,




అటవీ శాఖ అధికారుల బైక్ ర్యాలీ

నిర్మల్ జిల్లా జూన్ 3 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీని జిల్లా అటవీ శాఖ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని ముఖ్య కూడళ్లు, వీధుల గుండా ఈ ర్యాలీ సాగింది. పర్యావరణ రక్షణపై అవగాహన కలిగేలా నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్య నియంత్రణకు, భవిష్యత్ తరాల మనుగడకు పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. అడవుల సంరక్షణ, మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని, ఈ ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ వారోత్సవాల ద్వారా పర్యావరణ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ చేరవేయడమే లక్ష్యంగా పర్యావరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్ జిల్లా జూన్ 4 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లో కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న వరి ధాన్యం సేకరణ ప్రక్రియను జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలు అంశంపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ధాన్యం కొనుగోలు పురోగతి, మిగిలి ఉన్న ధాన్యం నిల్వలు, కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. తక్కువ పరిమాణంలో ధాన్యం మిగిలి ఉన్న కొనుగోలు కేంద్రాల్లో సేకరణను వేగవంతం చేసి, కొనుగోలు ప్రక్రియను పూర్తికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఇప్పటికే కొనుగోళు పూర్తయిన కేంద్రాల్లో అందుబాటులో ఉన్న లారీలు, హమాలీలను ధాన్యం నిల్వలు అధికంగా ఉన్న ఇతర కేంద్రాలకు తరలించి వినియోగించుకోవాలని సూచించారు. ధాన్యం సేకరణ, లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలో ఎటువంటి అంతరాయం కలగకుండా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, డిఆర్డిఓ విజయలక్ష్మి, డీఎం మార్క్‌ఫెడ్ మహేష్, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ పంటలు వేసుకోవాలి

## పంట మార్పిడి పద్ధతులు అవలంబించాలి : జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

## గ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాల ప్రారంభం





మహిళా సంఘాలను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా



మహిళా సంఘ భవనన్ని ప్రారంభించిన దృశ్యం



గిరిజన మహిళలతో కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్ జిల్లా జూన్ 4 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ పంటల సాగులో మార్పులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. గురువారం కుంటాల మండలం అంబగంటి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఆశించినంత స్థాయిలో వర్షపాతం ఉండకపోవచ్చని వాతావరణ శాఖ నివేదికలు సూచిస్తున్నందున రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని అన్నారు. పంట మార్పిడి పద్ధతులను అవలంబించి, తక్కువ నీటి అవసరమయ్యే కొత్త రకాల పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందిస్తారని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించి అధిక లాభాలు పొందాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని వినియోగించుకొని డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అవసరానికి మించి ఎరువులు వాడరాదని సూచించిన కలెక్టర్, జిల్లాలో రికార్డు స్థాయిలో మొక్కజొన్న కొనుగోలు జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలులో నిర్మల్ జిల్లా మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు. రాబోయే వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా పాటించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చెత్త బండ్లలో వేయడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టుకోవాలని, సోక్‌పిట్లు నిర్మించడం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి కొరత రాకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు కందులు, మినుములు, పెసర్లు, నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు మంచి లాభాలు పొందుతున్నారని, ఇతర రైతులు కూడా ఆ దిశగా ముందుకు రావాలని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.

గ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాల ప్రారంభం

అంతకుముందు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గ్రామసభకు హాజరైన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాస్, డీఆర్డీఓ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీఓ వనజ, సర్పంచ్ జ్యోతిబాయి, ఇతర అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఘాతంతో ఆవు మృతి

## రైతుకు ప్రభుత్వం తక్షణమే సాయం అందించలీ సర్పంచ్ అరుణ్ లాల్



బూరుగుపల్లి తండాలో విద్యుత్ నియంత్రణ వద్ద విద్యుత్ ఘాతంతో మృతి చెందిన ఆవు

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి జూన్ 4 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని బూరుగుపల్లి తండాకు చెందిన రైతు రాథోడ్ అరవింద్,కు చెందిన ఆవు పశుగ్రాసానికి వెళ్లి విద్యుత్ నియంత్రిక నా వద్ద విద్యుత్ ఘాతంతో మృతి చెందడం తో సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ అరుణ్ లాల్ విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో లైన్మెన్, నందు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించడం జరిగింది రైతు దాదాపు 50 వేల రూపాయల నష్టపోవడం జరిగింది ప్రభుత్వం రైతును ఆదుకొని ఆర్థిక సాయం అందించాలని సర్పంచ్ , అధికారులను కోరారు

# రహీం పాషా సీఐ కలిసిన కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగన్న




సిఐ ని సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ అదిలాబాద్ రూరల్ మండల్ పోలీస్ స్టేషన బదిలీపై వచ్చిన C I రహీం పాషా మర్యాదపూర్వకంగా శాలువా సన్మానించడం జరిగినది అదిలాబాద్ రూరల్ మండల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అలిశెట్టి నాగన్న మరియు మాజీ సర్పంచ్ కొడప లింగు గారు మరియు కాంగ్రెస్ నాయకులు సార్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# వాట్సాప్ విప్లవం..చరిత్ర సృష్టించిన సైమ్స్

## ప్రైవేట్ అకాడమీల సామ్రాజ్యాన్ని కదిలించిన సైమ్స్

## ఫీజు రూ.0, కసి 100% ..పల్లె బిడ్డలు రాసిన చరిత్ర

## బిల్డింగ్ అవసరం లేదు.. కసి ఉంటే చాలు.. బండారి ప్రసాద్




అమృత్ తెలంగాణ విద్య అంటే వ్యాపారం కాదు, సేవ అని నిరూపిస్తూ సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ (సైమ్స్ ) భారత దేశ చరిత్రలోనే ఒక కొత్త అధ్యాయం లిఖించింది. లక్షల రూపాయల ఫీజులు, కోట్ల రూపాయల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే ముసుగులో నడుస్తున్న ప్రైవేట్ డిఫెన్స్ అకాడమీల ముఖాలపై చెళ్లుమనిపించేలా, కేవలం ఒక వాట్సాప్ గ్రూప్ ద్వారా 2026 ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో 55 మంది యువకులకు ఉద్యోగాలు వచ్చేలా చేసి సంచలనం సృష్టించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల నుండి వచ్చిన ఈ 55 మంది యువకులు ఇప్పుడు దేశ సరిహద్దులను కాపాడే భాగ్యం పొందారు. ఇది రిజల్ట్ కాదు.. ఇది ఒక తిరుగుబాటు.

గత దశాబ్ద కాలంగా డిఫెన్స్ కోచింగ్ అంటే సామాన్యుడికి అందనంత దూరం. ఏడాదికి రూ.1.5 లక్షల నుండి రూ.4 లక్షల వరకు ఫీజులు వసూలు చేసి, 5 లేదా 10 మంది సెలెక్ట్ అయ్యారంటే గొప్పగా చెప్పుకుంటున్న అకాడమీల మధ్యలో సైమ్స్ ఒక్కసారిగా 55 మంది సెలెక్ట్ ఐన వారితో ఎంట్రీ ఇచ్చింది.

విశేషం ఏమిటంటే: ఫీజు -- రూ.0

బిల్డింగ్ -- లేదు

ఉన్నదల్లా ఒక కళ.. ఒక లక్ష్యం, ఒక వాట్సాప్ గ్రూప్

ఎంపికైన 55 మందిలో 50 మంది రైతు, వ్యవసాయ కూలీ, ఆటో డ్రైవర్, చిన్న దుకాణం నడిపే కుటుంబాలకు చెందినవారే. వారి తల్లిదండ్రుల కళ్లల్లో ఈరోజు ఆనందబాష్పాలతో "మా కొడుకు ఆర్మీలో ఉన్నాడు" అని గర్వంగా చెప్పుకుంటున్నారు.

సైమ్స్ సక్సెస్ ఫార్ములా -- 3 సూత్రాలు

సూత్రం:1 జీరో ఫీజు, మాక్స్ కమిట్మెంట్ .. పేద విద్యార్థి ఆర్థిక పరిస్థితి అతని కళకు అడ్డుకాకూడదు. ఈ సిద్ధాంతంతో సైమ్స్ అన్ని స్టడీ మెటీరియల్స్, పిడిఎఫ్ నోట్స్, డైలీ 100 ప్రశ్నల మాక్ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ ట్రైనింగ్ వీడియోలను ఉచితంగా అందించింది.

సూత్రం 2: 24-7 వ్యక్తిగత మెంటార్‌షిప్

సైమ్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారి ప్రసాద్ ముదిరాజ్ ప్రతి విద్యార్థికి పర్సనల్ మెంటార్. అర్ధరాత్రి 2 గంటలకు వచ్చిన డౌట్ అయినా, పరీక్షకు ముందు వచ్చిన టెన్షన్ అయినా స్వయంగా వాట్సాప్‌లో సమాధానం ఇచ్చేవారు. ఇది ఏ ప్రైవేట్ అకాడమీలోనూ జరగదు. సూత్రం :3 పల్లె నుండి పాలిటెక్నిక్ - టీజీ ,ఏపీలోని అదిలాబాద్ నుండి అనంతపురం వరకు, ప్రతి మండలం నుండి విద్యార్థులను గుర్తించి వారిని ఒకే వేదికపైకి తెచ్చారు. "నువ్వు ఒంటరివి కాదు, నీ వెనుక 1000 మంది సైనికులు ఉన్నారు" అనే భరోసా ఇచ్చారు.

ప్రశ్న: ఈ విజయ రహస్యం ఏమిటి - జవాబు: రహస్యం ఏమీ లేదు బ్రదర్. కోచింగ్ సెంటర్ అనేది ఒక సిస్టమ్ కాదు, అది ఒక ఆలోచన, కసి, క్రమశిక్షణ, దేశభక్తి ఉంటే వాట్సాప్ కూడా నేషనల్ డిఫెన్స్ అకాడమీ అవుతుంది. మా పిల్లలు అదే నిరూపించారు.

# ప్రారంభమైన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' ప్రత్యేక గ్రామసభలు



జూన్ 4 అమృత్ తెలంగాణ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న లిలి'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక'లో భాగంగా ఆలేరు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు.జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు జూన్ 4, 6, 8, 10 తేదీలలో గ్రామసభలు నిర్వహించనుండగా,తొలి రోజు షెడ్యూల్ ప్రకారం శ్రీనివాసపురం, పటేల్‌గూడెం,సాయిగూడెం, మంతపురి గ్రామాల్లో మండల స్థాయి అధికారుల బృందం పర్యటించి గ్రామస్తులతో సమావేశమైంది.ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు ప్రభుత్వం నిర్దేశించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాలు,అమలు విధానాలు, గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఘనద్రవ్య వ్యర్థాల నిర్వహణ,సంపూర్ణ పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, మురుగు కాలువల పూడికతీత, శిథిలావస్థలో ఉన్న భవనాల గుర్తింపు వంటి అంశాలను వివరించారు. అలాగే రాబోయే జనగణన-2027, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం, పంట మార్పిడి విధానాలు,ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పరిశుభ్రమైన తాగునీటి సరఫరా,క్లోరినేషన్,పైప్‌లైన్ లీకేజీల నివారణ చర్యలపై సంబంధిత అధికారులు ప్రజలకు సూచనలు చేశారు. ఉపాధి హామీ పథకం కింద 'జల సంరక్షణ -- మన సంరక్షణ' కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణం అవసరాన్ని వివరించారు. వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రగ్స్ నివారణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణపై కూడా అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం,బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల నమోదు పెంపు, అల్పాహార భోజన పథకం అమలు, గృహాలపై సోలార్ విద్యుత్ ఏర్పాటు, ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడత గృహప్రవేశాలు, రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియల గురించి అధికారులు వివరించారు.

# మంత్లీ క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించిన నిర్మల్ జిల్లా ఎస్పీ

**దీర్ఘకాలిక పెండింగ్ కేసుల పరిష్కారం,CCTNS నవీకరణపై అధికారులకు ఆదేశాలు**
**రౌడీషీటర్లపై నిఘా పెంచి నేరాలను అరికట్టాలి**
**వృద్ధులు, మహిళలు, పిల్లల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలి : జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్**





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ మంత్లీ క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో భాగంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ ఈరోజు నిర్మల్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.వృద్ధులు, మహిళలు, పిల్లలపై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, వారికి సంబంధించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై సంబంధిత ఎస్‌డీపీఓలు మెమోలు జారీ చేసి, వాటి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.అందరూ ఎస్‌హెచ్‌ఓలు కేసుల పురోగతిని క్రమం తప్పకుండా నవీకరిస్తూ, పాత కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదేవిధంగా, CCTNS డేటాను తప్పనిసరిగా నవీకరించాలని, మాన్యువల్ రికార్డులు, CCTNS నమోదుల మధ్య ఉన్న వ్యత్యాసాలను వెంటనే సరిచేయాలని సూచించారు.జిల్లాలో నేరాల సంఖ్యను తగ్గించేందుకు రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి, నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన పెంచుకుని జాగ్రత్తగా ఉండాలని, మోసాలకు గురైన వెంటనే మొదటి గంట (Golden Hour)లోపు 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా N.C.R.P. పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తూ, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఫేక్ నెంబర్ ప్లేట్లు, నెంబర్ ప్లేట్ మార్పులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్‌తో పాటు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు గోవర్ధన్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, కృష్ణ, రవీందర్ నాయక్, సమ్మయ్య, సాయి కుమార్, దీపక్, అన్ని పోలీసు స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ జూన్ 4, 2026 : ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, ప్రత్యేక ఉపపాలన అధికారి డి.చంద్రకళలతో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 25 నుండి జూలై 24వ తేదీ వరకు ఇంటింటి గణన చేపట్టాలని, ఎన్యుపరేషన్ ఫారం నమోదు తర్వాత బూత్ స్థాయి అధికారులు వివరాలను పరిశీలించాలని, సరైన అర్హత గల ఓటర్ల ముసాయిరా జాబితా తయారుచేసి, నివేదికల పరిశీలించి హేతుబద్ధీకరించిన ముసాయిదా జాబితాను 31 తేదీన ప్రచురించాలని తెలిపారు. జూలై 31వ తేదీ నుండి ఆగస్టు 30వ తేదీ వరకు ముసాయిదా జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించాలని, జూలై 31 వ తేదీ నుండి సెప్టెంబర్ 28వ తేదీ వరకు ఎన్యుమరేషన్ ఫారాలపై నిర్ణయం, ఫిర్యాదులు, అభ్యంతరాలు పరిష్కరించే దిశగా ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని, ఒక పోలింగ్ కేంద్రం పరిధిలోని కుటుంబానికి సంబంధించిన ఓటర్లు అందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధి లోనికి వచ్చే విధంగా జాబితా రూపొందించాలని తెలిపారు. మ్యాపింగ్, ఓటర్ల తొలగింపు ప్రక్రియలలో రాజకీయ పార్టీల నుండి నియమించబడిన బూత్ స్థాయి ఏజెంట్ల సహకారం తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, అర్హత గల ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడాలని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా 2 ఆపైన ఓటరు గుర్తింపు కార్డులు కలిగి ఉన్నట్లయితే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, ఒకరికి ఒక ఓటరు గుర్తింపు కార్డు మాత్రమే ఉండాలని, విషయమై ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ఎక్కువ కార్డులు కలిగి ఉన్నట్లయితే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మరణించిన వారి వివరాలు ఎట్టి పరిస్థితులలో జాబితాలో రాకూడదని, ఒకవేళ తుది జాబితాలో మరణించిన వారి వివరాలు వచ్చినట్లయితే సంబంధిత బూత్ స్థాయి అధికారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వివరాల సేకరణ, ఫారాల పూరింపు, జాబితా పరిశీలన, ఇతర అంశాలపై బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీలచే నియమింపబడిన బూత్ స్థాయి ఏజెంట్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, పూరింపు, 2002 ఓటర్ల జాబితాలో వివరాల పరిశీలన, చిరునామా మారినట్లయితే వివరాల నవీకరణ, ఎన్యుమరేషన్ ఫారం లో సవరణ ప్రక్రియలు సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాల వయసు వచ్చే ఓటర్లు ఇంటింటి గణన కార్యక్రమంలో ఫారం 6, డిక్లరేషన్ ఫారం పొంది దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారం పూరించడంలో, ఓటర్ల వివరాలు వెతకడంలో ఓటర్లు టోల్ ఫ్రీ ఓటర్ హెల్ప్ లైన్ నెంబర్ 1950, ఆన్లైన్ లో https://voters.eci.gov.in వెబ్ సైట్ లో, ECINET యాప్ లో సంప్రదించవచ్చని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ సజావుగా సాగేలా, స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు బూత్ స్థాయి అధికారులకు సహకరించాలని తెలిపారు. అనంతరం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదామును త్రైమాసిక తనిఖీలలో భాగంగా ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈవీఎం గోదాము వద్ద నిరంతర భద్రతా చర్యలు చేపట్టడం జరుగుతుందని, ఈవీఎం రక్షణ దిశగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జల్ భగీరథ పథకం కింద ఇంకుడు గుంతల నిర్మాణ పనులు



అమృత్ తెలంగాణ ఆలేరు పురపాలక సంఘంలో జల్ భగీరథ పథకం కింద ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు, ఆలేరు పురపాలక సంఘం చైర్ పర్సన్ బీజన బాలమణి భాస్కర్ అన్నారు. ఆలేరు పట్టణంలో గురువారం 2,3 వార్డులలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యాచరణ ప్రణాళిక సమావేశం మున్సిపల్ కమిషనర్ కే శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వార్డు సభలు నిర్వహించారు. వార్డు సభలలో ప్రజలకు సాలిడ్ వెస్ట్ మేనేజిమెంట్ రూల్స్, 2026.,జల్ సంచయ్ -- జల్ భగీరత పథకం క్రింద ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టుట, మురికి కాలువల శుభ్రం చేయుట మరియు పూడిక తీయు పనులు,వర్షాకాల సంసిద్ధత పై కార్యాచరణ ప్రణాళిక గురించి మాట్లాడారు. మంచి నీటి సరఫరా మరియు నిర్వహణ,నీరు నిలువ ప్రాంతాల నివారణ మరియు పారిశుద్ధ్యం, రోడ్ల నిర్వహణ మరియు వీది దీపాలు, మొక్కలు మరియు పర్యావరణ సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ వనరాశి మరియమ్మ, 3వ వార్డు కౌన్సిలర్ యాట శివ, మేనేజర్ బి జగన్ మోహన్, మున్సిపల్ కో ఆప్షన్ కౌన్సిల్ సభ్యురాలు ఇంతియాజ్ ఇర్ఫాన్, ఇన్చార్జి ఎస్ఐ రూపశ్రీ, మున్సిపల్ సిబ్బంది కే రాజు, కే.బాబు, మెప్మా రిసోర్స్ పర్సన్ లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు అమ్మాయిని టాలెంట్ గుర్తించాల్సిందే..!



టాలీవుడ్ లో సైడ్ రోల్స్ తో పాటుగా చిన్న సినిమాల్లో హీరోయిన్ గా చేస్తూ మెప్పిస్తున్న భామ పూజిత పొన్నాడ. తెలుగు అమ్మాయి అయిన పూజిత రంగస్థలం లో ఆది పినిశెట్టి లవర్ గా కనిపించి అలరించింది. అందం అభినయం ఉన్నా సరే అమ్మడికి లక్ కలిసి రావట్లేదు. ఆమె చేస్తున్న సినిమాలేవి ఆడియన్స్ కి పెద్దగా రిజిస్టర్ అవ్వట్లేదు. వచ్చిన అర కొర అవకాశాలనే చేస్తూ కెరీర్ వెళ్లదీస్తుంది అమ్మడు. సినిమాల కన్నా ఫోటో షూట్స్ తో ఎక్కువ క్రేజ్ తెచ్చుకుంటుంది పూజిత. అందుకే అమ్మడి సోషల్ మీడియా ఫాలోవర్స్ కూడా ఎక్కువగానే ఉన్నారు. తరచూ తన లేటెస్ట్ ఫోటో షూట్స్ తో ఫాలోవర్స్ ని అలరిస్తుంది పూజిత. అయితే తన గ్లామర్ సైడ్ కన్నా తన క్యూట్ లుక్స్ తో ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది. లేటెస్ట్ గా అమ్మడు బీచ్ లో శారీ లుక్ లో ఫోటో షూట్ చేసింది. అది చూసిన కుర్రాళ్లు పూజిత నా హృదయ దేవత నువ్వే అంటూ కామెంట్స్ చేస్తున్నారు. వైట్ కలర్ శారీలో వావ్ అనిపించేలా అమ్మడి అందాలు కేక పెట్టిస్తున్నాయి. సరైన ఛాన్స్ వస్తే చాలు తన టాలెంట్ ఏంటో చూపించాలని చూస్తున్న పూజిత పొన్నాడకి అలాంటి అవకాశం రావట్లేదని చెప్పొచ్చు. లాస్ట్ ఇయర్ ఓదెల రైల్వేస్టేషన్ సినిమాలో సెకండ్ హీరోయిన్ గా నటించిన పూజిత ఆకాశ వీధుల్లో అనే సినిమాలో హీరోయిన్ గా నటించింది. ప్రస్తుతం రవితేజ రావణాసుర తో పాటుగా తమిళంలో భగవాన్ సినిమా చేస్తుంది పూజిత. తెలుగు అమ్మాయి కదా గ్లామర్ విషయంలో అడ్డు చెబుతుందేమో అనుకుంటే తను చేస్తున్న సినిమాల్లో లిప్ లాక్స్ ఇస్తూ ఫుల్ కోపరేట్ చేస్తుంది పూజిత. అలాంటిది స్టార్ ఛాన్స్ వస్తే రెచ్చిపోకుండా ఉంటుందా చెప్పండి. కానీ అలాంటి ఛాన్స్ ఒకటి ఇచ్చి ఆమెను ఎంకరేజ్ చేస్తే మాత్రం పూజిత నెక్స్ట్ లెవల్ లో ఉంటుంది.

# 'పౌజీ' కోసం వాళ్లిద్దరి మధ్యా పోటీ!




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా భారీ లవ్ అండ్ వార్ ని హను రాఘవపూడి తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా భారీ లవ్ అండ్ వార్ పౌజీ ని హను రాఘవపూడి తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. 1800 ఏళ్ల కాలం నాటి పీరియాడిక్ స్టోరీలో అద్భుతమైన లవ్ స్టోరీని ఆవిష్కరి స్తున్నాడు. ఇందులో అందమైన ప్రేమ కథతో పాటు అంతకు మించి కళ్లు చెదిరే భారీ యాక్షన్ ఎపిసోడ్లు కూడా ఉంటున్నాయి. ఇందులో డార్లింగ్ కి ప్రభాస్ కి జోడీగా ఇమ్మాన్వీని ఎంపిక చేసిన సంగతి తెలిసిందే లాంచింగ్ రోజే అమ్మడు అభిమానుల మనసులు దొచేసింది. తన అందచందాలతో నెట్టింట సంచల నమైంది. అటుపై డాన్సులో తానెంత ప్రొఫెషనల్ అన్నది ఓ వీడియో ద్వారా అర్దమైంది. అంతటి ట్యాలెం టెడ్ బ్యూటీ ఇంతకాలం ఎక్కడ ఉంది? అనే చర్చకు తెరి తీసిందంటే? ఇమాన్వీ పై ఏ రేంజ్ లో హై వచ్చిందో అర్దమవుతుంది. ఇమాన్వీలో ఇవన్నీ చూసే హను ఛాన్స్ ఇచ్చాడన్నది అంతే వాస్తవం. కంటెంట్ లో ఏది బెస్ట్ అంటే..? అయితే ఇందులో సెకెండ్ లీడ్ కూడా ఒకటుంది. ఆ పాత్ర కోసం ఇప్పటికే మృణాల్ ఠాకూర్ ను పరి శీలిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. కానీ మృణాల్ నటిస్తే ఫ్రెష్ ఫీల్ రాదు ? అన్న ఆలోచనలోనూ హను ఉన్నాడుట. ఈ నేపథ్యంలోప్రత్యామ్నాయంగా బాలీవుడ్ బ్యూటీ దిశాపటానీని పరిశీలిస్తున్నారుట. కల్కి 2898 లో దిశా నటించిన సంగతి తెలిసిందే. తెరపై కనిపించింది కాసేపే అయినా ప్రేక్షకుల్ని ఎంగేజ్ చేసింది. ఈ నేపథ్యంలో మృణాల్ కంటే దిశా పటానీ అయితే బాగుంటుందని మేకర్స్ భావిస్తున్నారుట. అయితే ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సమాచారం. దీంతో మృణాల్–దిశా పటానీ మధ్య ఛాన్స్ విషయంలో పోటీ కనిపిస్తుంది. మృణాల్ ఠాకూరు కూడా ఇప్పటి వరకూ ప్రభాస్ తో నటించే ఛాన్స్ రాలేదు. అలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తోంది. ఇప్పుడా ఛాన్స్ వచ్చినట్లే వచ్చి చేజారుతున్నట్లు కనిపిస్తుంది.

# శ్రీలంక తీరంలో బికినీ బ్యూటీ వేషాలు

ఇటీవల సమ్మర్ హీట్ అంతకంతకు పెరుగుతోంది. దీంతో సెలబ్రిటీలంతా మాల్దీవుల ప్రయాణంలో ఉన్నారు. ఇటీవల సమ్మర్ హీట్ అంతకంతకు పెరుగుతోంది. దీంతో సెలబ్రిటీలంతా మాల్దీవుల ప్రయాణంలో ఉన్నారు. గోవా టూరిజం అంతకంతకు దిగజారుతోందని నివేదికలు ఉన్నా .. లక్ష్యద్వీప్ టూరిజాన్ని డెవలప్ చేయాలని ప్రభుత్వం పూనుకున్నా.. మాల్దీవులకు డిమాండ్ తగ్గలేదు. ఒంటరి దీవుల్లో చిల్ అయ్యేందుకు తారలు ఆసక్తిగా ఉన్నారు. అయితే ఇతరులకు భిన్నంగా నేహా శర్మ ఇటీవల శ్రీలంక తీరంలో తళుక్కున మెరిపించింది. బ్లాక్ మోనోకినిలో హృదయాలను కొల్లగొట్టింది. బీచ్ లో అందమైన భంగిమలతో నేహా శర్మ చెలరేగిపోయింది. నేహా ఫిట్‌నెస్ ఫ్రీక్ అన్న సంగతి తెలిసిందే. జిమ్‌లు స్టూడియోల వెలుపల ఎక్కువగా కనిపిస్తుంది. ఇప్పుడు కూడా జిమ్ లో కసరత్తులు చేసాకే ఇలా బీచ్ లో ప్రత్యక్షమైంది. ప్రస్తుతం ఈ ఫోటోలను యువతరం వైరల్ గా షేర్ చేస్తున్నారు. ఈసారి సీక్వెల్‌లో చించేద్దాం! కెరీర్ మ్యాటర్ కి వస్తే.. నేహా చివరిగా విజయ్ దేవరకొండఫ్యామిలీ స్టార్‌లో అతిథి పాత్రలో కనిపించింది. కానీ ఈ సినిమా ఫ్లాపైన సంగతి తెలిసిందే. టాలీవుడ్ బాలీవుడ్ లో కొన్ని పెద్ద సినిమాల్లో నటించినా కానీ నేహా శర్మ ఫేట్ మారలేదు. కాంపిటీషన్ లో ఈ భామ వెనకబడింది. నేటితరం చిల్లింగ్ గాల్స్ రేసులో దూసుకుపోతున్నా, నేహా కేవలం మోడలింగ్ అసైన్ మెంట్స్ ఇన్ స్టా పోస్టులకు పరిమితమైంది. హేరాఫేరి 3 లో నటిస్తోందని కబురందినా కానీ ఈ సినిమా తాజా అప్ డేట్ అందలేదు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# వీరమల్లుతో అందాల భామ.. అంతా సిద్ధం..!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ క్రిష్ కాంబోలో వస్తున్న భారీ బడ్జెట్ మూవీ హరి హర వీరమల్లు సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. సినిమాలో ఇప్పటికే నిధి అగర్వాల్ జాక్వెలిన్ లాంటి అందాల భామలు నటిస్తుండగా మరో అందాల భామ నోరా ఫతేహి కూడా భాగం అవుతుందని తెలుస్తుంది. బాహుబలి సినిమాలో ఇరుక్కుపో సాంగ్ తో పాపులర్ అయిన నోరా ఓ పక్క బాలీవుడ్ సినిమాలతో బిజీ బిజీగా ఉంటుంది. అయితే సౌత్ నుంచి ముఖ్యంగా టాలీవుడ్ నుంచి ఏ చిన్న ఛాన్స్ వచ్చినా సరే కాదనకుండా చేస్తుంది అమ్మడు. పవన్ కళ్యాణ్ హరి హర వీరమల్లు సినిమా లో కూడా నోరా ఫతేహి రిజిస్టర్ అయ్యే రోల్ లో నటిస్తుందని తెలుస్తుంది. ఈ నెల చివరన మొదలయ్యే షెడ్యూల్ లో నోరా పాల్గొంటుందని తెలుస్తుంది. ఆమెతో కీలక సన్నివేశాలు ఈ షెడ్యూల్ లో షూట్ చేస్తారని తెలుస్తుంది. వీరమల్లు సినిమాలో తన పాత్రతో మరోసారి తెలుగు ఆడియన్స్ ని అలరించనుంది నోరా ఫతేహి. వచ్చిన ప్రతి ఛాన్స్ వదలకుండా చేస్తూ వస్తుంది నోరా. అందాల భామ బాలీవుడ్ సినిమాల్లో ఎక్కువగా స్పెషల్ సాంగ్స్ లో అలరిస్తుంది. తెలుగులో కూడా అలాంటి ఛాన్స్ లే వస్తుండటంతో ఇక్కడ కూడా తన టాలెంట్ చూపిస్తుంది. ఇక వీరమల్లు లాంటి ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ లో నటించడం ఆమె కెరీర్ గ్రోత్ కి హెల్ప్ చేస్తుందని చెప్పొచ్చు. హరి హర వీరమల్లు సినిమా క్రిష్ ఎంతో అద్భుతంగా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుంది. సినిమాలో ఫ్యాన్స్ అంతా సరికొత్త పవన్ కళ్యాణ్ ని చూస్తారని తెలుస్తుంది. కీరవాణి మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమాకు మ్యూజిక్ కూడా మరో హైలెట్ అయ్యేలా జాగ్రత్త వహిస్తున్నారని తెలుస్తుంది. కొన్నాళ్లుగా షూటింగ్ వాయిదా పడుతుండగా ఈసారి పవన్ సినిమా పూర్తి చేసేందుకు పూర్తి డేట్స్ ఇచ్చినట్టు తెలుస్తుంది. ఏ.ఎం.రత్నం నిర్మిస్తున్న ఈ సినిమా పవర్ స్టార్ ఫ్యాన్స్ అందరిని మెప్పించేలా చేస్తుందని అంటున్నారు. ఈ సమ్మర్ రిలీజ్ ప్లాన్ చేస్తున్న ఈ సినిమా సమ్మర్ కి కుదరకపోతే దసరాకి వాయిదా వేసే ఛాన్స్ ఉందని టాక్.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com